సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం, 28, మే, 2025



రోడ్డు పనుల అడ్డగింత

తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు రోడ్డు పనులను అడ్డుకున్నారు.

వివరాలు 8లో ▸



తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

తీర్థ యాత్రల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.8 /21.9

వాతావరణం

పొద్దస్తమానం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరుతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పీయూలో 4వ స్నాతకోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవం వచ్చే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో స్నాకోత్సవం కోసం దరఖాస్తు చేసుకునన్న వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, 2022- 24 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, ఫీజు దరఖాస్తు ఫారాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. టావర్స్‌కు గోల్డ్ మెడల్, కన్వకేషన్ సర్టిఫికెట్లను ముఖ్య అతిథులచే అందిస్తామన్నారు. జూన్ 16 వరకు నేరుగా, 30 వరకు ఫైన్‌తో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

అప్రెంటీస్ శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: టీజీఎస్ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని డిపోల్లోని ఇంజినీరింగ్ విభాగంలో మూడేళ్ల అప్రెంటీస్ శిక్షణ కోసం ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమొబైల్, మెకానికల్ ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్హతలు 2020 విద్యా సంవత్సరం తర్వాత ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులను నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీం https://nats.education.gov.in వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకొని టీజీఎస్ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని, అప్రెంటీస్ శిక్షణ కాలంలో ప్రతినెల స్టైఫండ్ అందిస్తామని చెప్పారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు కొనసాగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ మేరకు 19 పరీక్ష కేంద్రాల్లో చివరిరోజు ఉదయం సెషన్ ప్రథమ సంవత్సరంలో 3,326 మందికి గాను 3,093 మంది హాజరవగా.. 233 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరంలో 992 మందికి గాను 903 మంది హాజరవగా.. 89 మంది గైర్హాజరయ్యారు.

పథకాల అమలులో కీలకపాత్ర పోషించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలులో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. జిల్లాల్లో వచ్చే వ్యతిరేక వార్తలలో సత్యాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. రైస్ మిల్లులను నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా రైతులకు అన్యాయం చేయాలని చూస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు పర్యవేక్షించాలని, ఇళ్ల కోసం లబ్ధిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.

వన మహోత్సవానికి సన్నద్ధం కావాలి

వన మహోత్సవం కార్యక్రమానికి అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవం కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా లక్ష్యంగా నిర్దేశించిన 58 లక్షల మొక్కలు నాటాలని సూచించారు. ఇందులో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు.



నార్లాపూర్ వద్ద పాలమూరు ఎత్తిపోతల ఇంటెక్

పాలమూరు- రంగారెడ్డి:

15 వేల ఎకరాలు.. రూ.300 కోట్లు

12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన సూదిని జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 15 వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉన్నట్లు అంచనా. అదేవిధంగా కాల్వలు, డిస్ట్రిబ్యూటర్లు వంటి స్ట్రక్చర్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. పాలమూరు ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించగా.. ఇందులో భూసేకరణకు రూ.300 కోట్లు వెచ్చించనుంది.



అసంపూర్తిదశలో సంగంబండ రిజర్వాయర్ పిల్ల కాల్వలు

భీమా: పిల్ల కాల్వల నిర్మాణంలో వేగం

భీమా ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన సంగంబండ రిజర్వాయర్‌ను 1995 డిసెంబర్ 30న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దీని ఊసే మరిచిపోగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహానేత వైఎస్సార్ రాజీవ్ ఎత్తిపోతల పథకం అని నామకరణం చేసి భీమా ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో ఫేజ్-1, 2 కింద పనులు చేపట్టారు. 2004-05 ప్రకారం అంచనా వ్యయం రూ.750 కోట్లు కాగా.. రూ.922 కోట్లకు పెరిగింది. చిన్నగోప్లాపూర్, మక్తల్‌లో పంప్‌హౌస్‌ల నుంచి నీటిని పంపింగ్ చేస్తూ.. భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా 45 వేలు, సంగంబండ రిజర్వాయర్ ద్వారా 65 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా ప్లాన్ రూపొందించారు. అయితే 90 శాతం పనులు పూర్తికాగా.. పిల్ల కాల్వల పనులు మిగిలిపోయాయి. భూసేకరణ సమస్య లేకపోవడంతో పనుల్లో వేగం పెంచారు.

జలయజ్ఞం ప్రాజెక్ట్‌లపై నజర్

పెండింగ్ భూసేకరణపై సర్కారు ప్రత్యేక దృష్టి

- నెట్టెంపాడులో 610 ఎకరాలకు రూ.25 కోట్లు విడుదల
- 'పాలమూరు'లో 15 వేల ఎకరాలకు రూ.300 కోట్లు..
- భీమా, కల్వకుర్తి ఎత్తిపోతల పనులపైనా కసరత్తు
- పనుల పురోగతిపై ప్రత్యేక అధికారి రవినాయక్ ఆరా
- ఇటీవల ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వలసలకు పేరుగాంచిన ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేయాలనే తలంపుతో రెండు దశాబ్దాల క్రితం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞం ప్రాజెక్ట్‌ల పనులు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు.. అనంతర పరిణామాల క్రమంలో ఉమ్మడి జిల్లాలోని జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా, మహాత్మాగాంధీ కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు చివరిదశలో అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్ట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణ.. నిధులే ప్రధాన అడ్డంకులుగా గుర్తించిన సర్కారు.. ఆయా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది. జలయజ్ఞం ప్రాజెక్ట్‌లను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకుసాగుతోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన రవినాయక్ ఇటీవల ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామని.. అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో రావాలని సూచించారు. ఈ నేపథ్యంలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాల స్థితిగతులు, పెండింగ్ పనులు.. భూసేకరణపై 'సాక్షి' ప్రాజెక్ట్ రిపోర్ట్..



కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు అప్రోచ్ కెనాల్

నెట్టెంపాడు: మరో 58 వేల ఎకరాలకు నీరందించేలా..



నెట్టెంపాడు ప్రాజెక్టు 100ప్యాకేజీ పరిధిలో పరమాల వద్ద అసంపూర్తిగా ఉన్న కాల్వ

గద్వాల జిల్లా ధరూర్ మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను రూ.1,478 కోట్ల అంచనా వ్యయంతో 2005 సెప్టెంబర్‌లో వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారు. 14 ప్యాకేజీలు పనులు విభజించగా.. ఏడు రిజర్వాయర్లు (ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి, నాగర్‌దొడ్డి, తాటికుంట, ముత్తోనిపల్లి, చిన్నోనిపల్లి, సంగాల), రెండు లిఫ్టులు నిర్మించారు. 90శాతం పనులు పూర్తి కాగా.. ప్రస్తుతం 1,42,000 ఎకరాలకు సాగు నీరందుతోంది. 99సీ, 99డీ, 100 ప్యాకేజీలకు సంబంధించిన చిన్నపాటి వర్క్స్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులు పూర్తయితే మరో 58 వేల ఎకరాలకు సాగు నీరందనుంది. అయితే గద్వాల, ధరూరు మండలాల పరిధిలోని 99, 100 ప్యాకేజీల్లో 480 ఎకరాలు, ర్యాలంపాడు, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ల కింద మిగిలిన 120 ఎకరాలు.. మొత్తంగా 610 ఎకరాల మేర భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల రూ.25 కోట్లు విడుదల చేసింది. ఇందులో మొదటి ప్రాధాన్యత కింద 480 ఎకరాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో 10 శాతం పెండింగ్‌లో ఉన్న పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి.. రబీ సీజన్‌లో మిగిలిపోయిన 58 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా అధికారులు ముందుకు సాగుతున్నారు.

ప్రాజెక్ట్ రిపోర్ట్

కోయిల్‌సాగర్:

చివరి దశలో పనులు

2006లో రూ.349 కోట్లు కేటాయించి.. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి మహానేత వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి కాకుండానే పదేళ్ల తర్వాత 2016లో ప్రారంభించారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వలు, లింక్ కెనాల్ కింద కొత్తగా పిల్ల కాల్వల పనులు చేపట్టడానికి రూ.50 కోట్లతో రీ టెండర్లు పిలిచారు. అలాగే నాగిరెడ్డిపల్లి ఫేస్1, తీలేర్ ఫేస్ 2 పంపుహౌస్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులకు రూ.16.90 కోట్లతో రీ టెండర్లను పిలిచారు. ఎత్తిపోతల పథకం లక్ష్యం 50,250 ఎకరాలు కాగా.. వానాకాలం పంటల కింద 36 వేల ఎకరాలలకు, యాసంగిలో 12వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కోయిల్‌సాగర్ బ్యాక్ వాటర్ నుంచి దేవరకద్ర గ్రావిటీ కెనాల్‌ను రూ.23 కోట్లతో చేపట్టగా పనులు చివరిదశలో ఉన్నాయి. అజిలాపూర్, చౌదర్‌పల్లి ఎత్తిపోతల పథకం, రాజోలి నుంచి పేరూర్ వరకు ఎడమ కాల్వ పొడిగింపు పనులు చేపట్టాల్సి ఉంది.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

కేఎల్ఐ:

మరో 1.50 లక్షల ఎకరాలకు..



తాడూరు మండలం ఇంద్రకల్ సమీపంలో లైనింగ్ పనులు చేపట్టని కేఎల్ఐ కాల్వ

కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2002లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసినా.. పనులు ప్రారంభం కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ఆర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2,990 కోట్లు కేటాయించారు. ఇందులో నాలుగు రిజర్వాయర్లు ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడి పల్లి నిర్మించారు. ఆ తర్వాత దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. వైఎస్ మరణానంతరం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిన ప్రాజెక్ట్‌కు తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.1000 కోట్లు కేటాయించి పలు పనులు చేపట్టింది. మొదట ఈ ప్రాజెక్ట్ ద్వారా 2.30 లక్షల ఎకరాలకు నీరందించాలనేది లక్ష్యం కాగా.. ఆ తర్వాత ఆయకట్టు 4.20 లక్షల ఎకరాలకు పెరిగింది. ఇప్పటికీ చాలా పనులు పెండింగ్‌లో ఉండడంతో రెండు లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ ప్రాజెక్ట్‌కు రూ.900 కోట్లు కేటాయించగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టేలా కసరత్తు చేస్తున్నారు.

ప్రాజెక్ట్	అంచనా వ్యయం (రూ.కోట్లలో)	రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం (టీఎంసీలలో)
కేఎల్ఐ	3,990	4
నెట్టెంపాడు	1,478	11.50
భీమా	922	4
పాలమూరు-రంగారెడ్డి	35,200	67.89
కోయిల్‌సాగర్	349	2.7

ప్రాజెక్టుల సాగునీటి లక్ష్యం (ఎకరాల్లో..)

ప్రాజెక్ట్	లక్ష్యం	సాగునీరందుతున్నవి	అందనివి
కేఎల్ఐ	4,20,000	2,00,000	2,20,000
నెట్టెంపాడు	2,00,000	1,42,000	58,000
భీమా	1,11,000	91,000	20,000
పాలమూరు	12,30,000	-	-
కోయిల్‌సాగర్	50,250	36,000	14,250

రబీ నాటికి పూర్తిస్థాయిలో నీరందిస్తాం..



నెట్టెంపాడు ప్రాజెక్ట్ కింద 1.42 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం. డిసెంబర్ నాటికి మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ప్రధానంగా అవసరమైన 610 ఎకరాల భూమిని సేకరించేలా కసరత్తు చేపట్టాం. 99,100 ప్యాకేజీల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి.. మిగిలిన ఆయకట్టుకు రబీ నాటికి నీరందించేలా కృషి చేస్తాం. – రహీముద్దీన్, ఇరిగేషన్ ఎస్ఈ, జోగుళాంబ గద్వాల

ఎన్యుమరేటర్ల ఎదురుచూపులు

- 7 నెలలు గడిచినా అందని సమగ్ర కుటుంబ సర్వే పారితోషికం
- జిల్లాకు రూ.2,19,14,000 మంజూరు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గతేడాది నవంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టింది. అయితే సర్వే చేసిన ఎన్యుమరేటర్లకు మాత్రం పారితోషికం ఇవ్వకుండా ప్రభుత్వం ముండిచేయి చూపింది. సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12 వేలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారం నమోదు చేసినందుకు గాను రూ.25 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఈ సర్వే ప్రారంభానికి ముందే ప్రభుత్వం జిల్లాకు రూ.2,19,14 ,000 వేలు మంజూరు చేసింది. సర్వే ఫారాల ముద్రణ నుంచి పారితోషికాల చెల్లింపు వరకు ఈ నిధులు వినియోగించాలని సూచించింది. అయితే సర్వేతోపాటు డాటా ఎంట్రీ ప్రక్రియ ముగిసి 7 నెలలు దాటినా జిల్లాలో వాటి చెల్లింపులు జరగలేదు. దీంతో తమకు పారితోషికాలు ఎప్పుడు అందుతాయా.. అని ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



సమగ్ర కుటుంబ సర్వే శిక్షణలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు (ఫైల్)

ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో..

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు చెల్లించాల్సిన పారితోషికాల బిల్లులు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో రిజక్ట్ అయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వ సూచనల మేరకు మళ్లీ బిల్లులు చేస్తున్నాం. గతంలో బిల్లులు ల్యాప్స్ కావడం, మళ్లీ బిల్లులు చేయడంతో చెల్లింపు ఆలస్యమవుతుంది. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతోపాటు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సంబంధించిన పారితోషికాల బిల్లులన్నీ చెల్లిస్తాం. – రవీందర్, సీపీఓ

కేంద్ర పథకాలు క్షేత్రస్థాయికి చేరాలి



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ, పక్కన కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్లు తదితరులు

- దిశ సమావేశంలో కమిటీ చైర్మన్, ఎంపీ డీకే అరుణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దిశ కమిటీ చైర్మన్, ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ కమిటీ సమావేశంలో ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వ వాటాలతో కొనసాగుతున్న పథకాలు ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేయాలన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడానికి 252 యూనిట్లకు రూ.72.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. పథకంపై అర్హులైన లబ్ధిదారులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ఎంపిక చేయాలన్నారు. జాతీయ ఆయిల్ సీడ్ మిషన్ కార్యక్రమం కింద వంట నూనెల ఉత్పత్తికి 2025- 26 నుంచి వేరుశనగ సాగును కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లాలో 1,250 ఎకరాల్లో మూడేళ్లపాటు రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా వేరుశనగ సాగు చేయడానికి రెండు సంస్థలను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పత్తి సాగు చేస్తారని, ప్రత్యామ్నాయ పంటల సాగు కింద భూసారం పెరిగేందుకు డిమాండ్ ఉన్న వేరుశనగ పంట ద్వారా పల్లి నూనె ఉత్పత్తికి ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ రంగంలో వినూత్న ఒరవడి, సాగు యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

- వైద్యారోగ్య శాఖ ద్వారా సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, మెదడు వాపు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులపై విస్తృత ప్రచారం చేసి పరీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా, సీ సెక్షన్ తగ్గించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.
- జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ సాఫీగా నిర్వహించాలని, ధాన్యం కొనుగోలులో మహిళా సంఘాలకు వచ్చే కమీషన్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల పెంపకంతో జీవనాధారం కలిగిన వారికి రూ.20 లక్షల మేర చిన్న యూనిట్‌గా తీసుకుని లబ్ధి చేకూరే విధంగా బ్యాంకర్లు రుణ సహాయం అందించాలన్నారు.
- అటవీ శాఖ జింకల పార్కు కోసం ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి కృషి చేయాలన్నారు.
- మహిళాశిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న వర్కింగ్ మహిళా హాస్టల్‌లో అన్ని వసతులు కల్పించి ఎక్కువ సంఖ్యలో చేరేలా చూడాలన్నారు. బ్యాంకర్లు వివిధ ప్రభుత్వ శాఖలు ఎంఎస్ఎంఈఎంపీఎంఎఫ్ ఈ పథకాలకు రుణ సహాయం అందించాలన్నారు.
- జిల్లాలో డీఎంఎఫ్ నిధుల ద్వారా ప్రధానమంత్రి క్షేత్ర కల్యాణ యోజన పథకం అమలు, గనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్రప్రసాద్, జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి, డీపీఓ వెంకటేశ్, డీఆర్‌డీఓ నర్సింహులు, డీఎంహెచ్ఓ కృష్ణ, డీసీఓ శంకరాచారి, అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, డీపీఓ పార్థసారథి, ఆర్డీఓ నవీన్, గనుల శాఖ ఏడీ సంజయ్‌కుమార్, ఎల్‌డీఎం భాస్కర్ పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తం

- ముందస్తుగా జనరల్ ఆస్పత్రిలో 60 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యాధికారులు

పాలమూరు: దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్న క్రమంలో జిల్లాలోనూ వైద్య, ఆరోగ్యశాఖతోపాటు జనరల్ ఆస్పత్రి వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. దీంతో జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ భవనంలో 60 పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేక ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు, 50 వెంటిలేటర్స్, ఆక్సిజన్ ప్లాంట్స్‌కు మరమ్మతు చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడం, వర్షాలు కురుస్తుండటంతో చల్లని గాలుల వల్ల చాలామంది దగ్గు, జలుబు, జ్వరం బారినపడుతున్నారు. ఐసీఎంఆర్‌తోపాటు ప్రభుత్వ నిబంధల ప్రకారం జనరల్ ఆస్పత్రిలో ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. సీజనల్ వ్యాధులతోపాటు కరోనా వైరస్ కోసం ఆస్పత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు, డ్రగ్స్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇప్పటికే ఆక్సిజన్ ప్లాంట్స్ మరమ్మతు ప్రక్రియ ప్రారంభించామన్నారు. లక్షణాలు ఉన్నవారు ఎవరూ భయాందోళనకు గురి కాకుండా పరీక్షలు చేసుకోవాలని, దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు వారం కంటే ఎక్కువగా ఉంటే ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.



జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కోవిడ్ ప్రత్యేక వార్డు

భయపడొద్దు..

ప్రస్తుతం వస్తున్న కరోనా వైరస్ వల్ల భయపడాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ తెలిపారు. రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండటం, మాస్క్, చేతులు తరుచుగా శుభ్రం చేసుకోవడంతోపాటు వారం రోజుల పాటు లక్షణాలు ఉంటే కరోనా టెస్ట్ చేసుకొని ఐసోలేషన్ ఉంటే సరిపోతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంటున్నామని చెప్పారు.

క్లుప్తంగా

గంగాపూర్‌లో యువతి ఆత్మహత్య

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్‌లో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నెల 24న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నందిని(18) తలకు వేసుకునే రంగు నూనెను తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆలస్యంగా గమనించిన తల్లిదండ్రులు ఆమెను చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందగా మంగళవారం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై నందిని తండ్రి జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా యువతి ఆత్మహత్యకు కడుపు నొప్పి కారణమని కుటుంబ సభ్యులు చెప్పారు.

యువకుడు బలవన్మరణం

జడ్చర్ల: పట్టణంలోని కావేరమ్మపేటలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోయ మల్లేష్(26) కొన్ని రోజులుగా మానసిక సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

టీవీ చూసేందుకు వెళ్లిన చిన్నారిపై లైంగిక దాడి

జడ్చర్ల: అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై ఓ బాలుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని కావేరమ్మపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కావేరమ్మపేటలోని ఓ కాలనీలో సోమవారం చిన్నారి(4) తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లడంతో తమ ఇంటి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో టీవీ చూసేందుకు వెళ్లింది. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ బాలుడు(16) చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం చిన్నారి ఇంటికి వెళ్లిన తర్వాత తల్లి గమనించి ఆరా తీయగా విషయం బయటకు వచ్చింది. వెంటనే చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కమలాకర్, ఎస్‌ఐ మల్లేష్ చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లైంగిక దాడికి పాల్పడిన బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



అదృశ్యమైన తల్లి, పిల్లలు (ఫైల్)

నవాబుపేట: భర్తతో గొడవ పడి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో కామారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బంటు చెన్నయ్య కూతురు బంటు స్వప్న (26)ను ఆరేళ్ల క్రితం బోయపల్లికి చెందిన దర్పల్లి కొండయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరగటంతో ఈనెల 18న స్వప్న కుమారుడు శివకుమార్ (5), కూతురు హర్షిత(4)తో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త ఆమె ఆచూకీ కోసం వెతకగా 22న హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకొని ఇంటికి తీసుకొచ్చారు. అయితే ఆమె పుట్టింటికి వెళ్తానంటూ వెళ్లి మరోసారి అదృశ్యమైంది. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

నష్టపరిహారం కోసం

రోడ్డు పనుల అడ్డగింత



గంగిమాన్‌దొడ్డి దగ్గర రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న సైట్ ఇన్‌చార్జ్ అఫ్జల్

- అందని రెండో విడత పరిహారం
- అధికారులకు విన్నవించినా పట్టించుకోలే..
- భారత్‌మాల రోడ్డు సైట్ ఇన్‌చార్జ్ జోక్యంతో శాంతించిన రైతులు

గట్టు: మండలంలోని గంగిమాన్‌దొడ్డి వద్ద ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులను గట్టు, గంగిమాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మొదటి విడత పరిహారం చెల్లించిన అధికారులు.. ఆర్బిట్రేషన్ తర్వాత చెల్లించాల్సిన డబ్బులను ఇప్పటి దాకా చెల్లించలేదని రైతులు వాపోయారు. ఆర్బిట్రేషన్(భూములను నష్టపోయిన రైతులతో కలెక్టర్ సమావేశమై వారి డిమాండ్ మేరకు నష్టపరిహారం పెంచి, అందించేది) తర్వాత తమకు నోటీసులను ఇవ్వలేదని, అదనంగా తమకు నష్టపరిహారం ఇవ్వాలని ఇదివరకే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అయినా ఇప్పటికీ రెండో విడత పరిహారం మాత్రం తమకు చెల్లించడం లేదని రైతులు వాపోయారు. తాము కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే తమకేమి పట్టనట్లు అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయంగా అందించాల్సిన పరిహారం అందించేదాకా రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలుపుతామని రైతులు తేల్చి చెప్పారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా రోడ్డు నిర్మాణం కోసం మెటీరియల్ తీసుకెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. అటుగా వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు రైతుల ఆందోళనకు సంఘీభావం తెలియజేశారు. విషయం తెలుసుకున్న సైట్ ఇన్‌చార్జ్ అఫ్జల్ రైతులు ఘటనా స్థలానికి చేరుకొని.. రైతులకు న్యాయంగా రావాల్సిన పరిహారాన్ని అందించే విధంగా తాను కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రెండో విడత పరిహారం రాని రైతులతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలుస్తామని తెలిపారు.

ఫిబ్రవరిలోనే ఫిర్యాదు చేశా



నా భార్య పద్మావతి పేరున ఉన్న భూమి భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో పోయింది. మొదటి విడత పరిహారం చెల్లించారు. రెండో విడత పరిహారానికి సంబంధించి నోటీస్ అందలేదని ఫిబ్రవరిలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. మూడు పర్యాయాలు కలెక్టర్ కార్యాలయానికి తిరిగినా అధికారులు స్పందించలేదు. నష్టపరిహారం డబ్బులు ఇస్తారో లేదో కూడా తెలియడం లేదు.

– వెంకట్రాములు, గట్టు

తిరుగుతూనే ఉన్నాం



భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భూములను కోల్పోయినందుకు అందించే నష్టపరిహారం కోసం కార్యాలయాల చుట్టూ అనేక పర్యాయాలు తిరిగితే సగం మాత్రమే పరిహారం చెల్లించారు. ఆర్బిట్రేషన్ తర్వాత చెల్లించాల్సిన పరిహారం చెల్లించలేదు. గట్టు తహసీల్దార్ కార్యాలయంలో రెండవ విడత నోటీసు గురించి అడితే మాకేం తెలియదంటున్నారు.కలెక్టరేట్‌లో అడిగితే వస్తుందని చెబుతున్నారు. రెండు నెలలు గడిచాయి. ఇప్పటికి పరిహారం అందించలేదు.రెండవ విడత పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

– కావలి తిమ్మప్ప, గంగిమాన్‌దొడ్డి

పరిహారం కోసం..



రెండో విడత పరిహారం కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. అధికారులు ఆర్బిట్రేషన్ తర్వాత అందరికి ఒకేసారి నోటిసులిచ్చి పరిహారం చెల్లించారు. మమ్మల్ని ఎందుకు విస్మరించారో అర్థం కావడం లేదు. రెండో విడత పరిహారం కోసం గట్టు, గద్వాలకు తిరగలేకపోతున్నాం. మాకు న్యాయం చేయాలి.

– సంతోష్, గంగిమాన్‌దొడ్డి

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



ప్రాజెక్టులు, రోడ్డు నిర్మాణాల్లో భూములను కోల్పోయిన రైతులను నష్టపరిహారం విషయంలో ఇబ్బందులు పెట్టొద్దు. రైతులకు న్యాయంగా రావాల్సి నష్టపరిహారాన్ని అందించే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. నష్టపరిహారం కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితిని తీసుకొచ్చారంటే లోపం ఎక్కడుందో గుర్తించి, సరి చేసుకోవాలి. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదు. ఈ విషయమై నేరుగా కలెక్టర్‌ను కలుస్తాం.

– నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు

కురుమూర్తిలో అమావాస్య పూజలు



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూలైన్లో నిల్చున్న భక్తులు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి దర్శనానికి అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగించి గోవింద నామస్మరణ చేశారు. మెట్టు మెట్టుకు కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపాలను భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తుల రద్దీతో కనిపించింది. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో స్వీట్లు ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు అన్ని ఏర్పాట్లు చేశారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



వనపర్తి: తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14వ తేదీ నుంచి జూలై 13వ తేదీ వరకు హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాకేజీలకు సంబంధించిన వివరాలు..

ప్యాకేజీ 1: (గంగా రామాయణ పుణ్య క్షేత్రయాత్ర– ఎస్‌సీజెడ్‌బీజీ44): ఇందులో వారణాసి/అయోధ్య/నైమిశారణ్య/ప్రయాగరాజ్ /శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్టు ధర రూ.16,200, థర్డ్ ఏసీ ధర రూ.26,500, సెకండ్ ఏసీ ధర రూ.35,000 ఉంటుంది. ఈ తీర్థయాత్రలో ట్రైన్ సికి ంద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మ ,దిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి ,విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది.

ప్యాకేజీ 2: (ఐదు జ్యోతిర్లింగ క్షేత్రాల యాత్ర – సీజెడ్‌బీజీ43): ఉజ్జయిని (మహాకాళేశ్వర్–ఓంకారేశ్వర్– త్రయంబకేశ్వర్–భీమశంకర్–ఘృష్ణేశ్వర్) ఈ యాత్రలో మహాకాళేశ్వర్/ఓంకారేశ్వర్/త్రయంబకేశ్వర్ / భీంశంకర్/ఘృష్ణేశ్వర్/ఎల్లోరా/మోవ్/నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఇది జూలై 05వ తేదీన ప్రారంభమై 13వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్ ధర రూ.14700గా ఉండగా , థర్డ్ ఏసీ ధర రూ.22,900, సెకండ్ ఏసీ ధర రూ.29, 900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖడ్ పూర్ణ మీదుగా సాగుతుంది.

సౌకర్యాలు: రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్ మరియు టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శన స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వే స్టేషన్ నుంచి దేవాలయాల వరకు ప్రయాణం పూర్తిగా ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సాకర్యాలు సమకూరుస్తారు. కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందన్నారు. టికెట్ బుకింగ్ వివరాలకు 97013 60701, 92810 30712, 92814 95845, 92810 30749, 92810 30750 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌ని సందర్శించాలన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆదివాసీల ధర్నా



అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చెంచులు

అచ్చంపేట రూరల్: తాము సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, 40 ఏళ్లగా పంటలు పండిస్తున్న భూముల్లోకి వెళ్లకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆదివాసీలు ఆగ్రహం చేస్తూ మంగళవారం అచ్చంపేటలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చినా అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆదివాసీలు హెచ్చరించారు. ఆర్డీఓ మాధవి మాట్లాడుతూ చెంచులు సాగు చేస్తున్న భూములపైకి ఎవరూ కూడా వెళ్లొద్దని సీఎం ఆదేశించారన్నారు. భూముల వద్దకు అటవీశాఖ అధికారులు వెళ్లొద్దని ఆర్డీఓ సూచించారు. భూముల సాగును ఎవరైనా అడ్డుకుంటే తన దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ చెంచులకు భరోసా కల్పించారు.

స్పోర్ట్స్ అకాడమీలతో క్రీడాకారులకు వరం

- రాష్ట్రంలోని 8 అకాడమీల్లో ప్రవేశాలకు ఎంపికలు
- జూన్ 1 నుంచి 13 వరకు ఎంపికల కోసం పోటీలు



మెయిన్ స్టేడియంలో వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ అకాడమీలు ఔత్సాహిక క్రీడాకారులకు వరంలా మారుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న క్రీడాకారుల్లో చాలా మంది స్పోర్ట్స్ అకాడమీల నుంచే వచ్చిన వారు. దీంతో ప్రతి ఏడాది రాష్ట్రంలోని స్పోర్ట్స్ అకాడమీలు, వసతి గృహాల్లో ప్రవేశాలకు బాల, బాలికల ఎంపికలు నిర్వహిస్తుంటారు. రాష్ట్రంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ క్రీడా అకాడమీలు, వసతి గృహాల్లో 2025–26 సంవత్సర ప్రవేశానికి గాను అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాలకు సంబంధించి ప్రవేశాల్లో బాలబాలికలకు వచ్చేనెల 1 నుంచి 13 వరకు నిర్ణయించిన తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నారు. ఆసక్తి గలవారు కళాశాల లేదా పాఠశాల ప్రస్తుత విద్యా సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, క్రీడా ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎంపికలకు హాజరుకావాలి.

అకాడమీ, ఎంపికల షెడ్యూల్ ఇలా..

- జూన్ 1వ తేదీన సిద్దిపేట వాలీబాల్ అకాడమీ ఎంపికలు అదే అకాడమీలో జరగనున్నాయి.
- జూన్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్ సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ ఎంపికలు ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో..
- జూన్ 10, 11 తేదీల్లో హన్మకొండలోని ప్రాంతీయ క్రీడా వసతి గృహం (అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్) ఎంపికలు డీఎస్‌ఏ హన్మకొండలో..
- జూన్ 10వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీ, రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీ ఎంపికలు వచ్చేనెల 10న రాజన్న సిరిసిల్లలోని మినీ స్టేడియంలో..
- జూన్ 12వ తేదీన హాకీ అకాడమీ (వనపర్తి) ఎంపికలు వనపర్తి లోని డాక్టర్ బాలకిష్టయ్య మినీ స్టేడియంలో..
- జూన్ 12న అథ్లెటిక్స్ అకాడమీ (ఖమ్మం) ఎంపికలు..
- జూన్ 12, 13 తేదీల్లో వాలీబాల్ అకాడమీ (మహబూబ్‌నగర్) ఎంపికలు మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో..

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్రంలోని క్రీడా అకాడమీలు, వసతి గృహాల్లో ప్రవేశాల ఎంపికలను జిల్లాలోని అర్హులైన, ఆసక్తిగల బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌ఏసీ డీవైఎస్‌ఓ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఎంపిక స్థలాల్లో ఆయా తేదీల్లో ఉదయం 7 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

జాగ్రత్తలతో ప్రమాదాలకు దూరం



ఆకాశంలో ఉరుములు, మెరుపులు

అలంపూర్: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జోరు వర్షాలు, ముసురు, మరోవైపు విషసర్పాల సంచారంతో రైతులు ప్రమాదాలతో సావాసం చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా తప్పించుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు పలు సూచనలు చేశారు.

విష సర్పాల బెడద..

వర్షాలు కురవగానే పాములు బయటికి వస్తుంటాయి. గట్ల వెంట, చెట్లు, పిచ్చి మొక్కలు, బండరాళ్లు, గడ్డివాములు ఉన్న చోట పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు పొలం పనులకు వెళ్లే దారిలోను పనుల్లో నిమగ్నమై గట్ల వెంట నడుస్తూ పాముకాటుకు గురైన సంఘటనలు అనేకం ఉంటాయి.

జాగ్రత్తలు..

- చీకటి సమయాల్లో పూర్తిగా చార్జింగ్ చేసిన టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి
- చేతిలో కర్రను వెంట పట్టుకొని వెళ్లాలి.
- తప్పనిసరిగా పాదరక్షలు ధరించాలి. బూట్లు ధరిస్తే ఇంకా మంచిది
- పొలం గట్లపై నడుస్తున్నప్పుడు చప్పుడు చేసుకుంటు వెళ్లాలి
- పాముకాటుకు గురైతే తక్షణమే సమీప ఆస్పత్రికి తరలించాలి
- నాటు వైద్యంపై ఆధారపడొద్దు

వాగులు.. వరద ఉధృతి

వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుంటాయి. వ్యవసాయ పనులకు వెళ్లే దారిలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రైతులు పొలాల నుంచి వచ్చే సమయాల్లో ఇలాంటి పరిస్థితి ఎదురైతే చాకచక్యంగా వ్యవహరించాలి.

జాగ్రత్తలు:

- నీటి ఉధృతి ఎలా ఉందో ముందుగా గమనించాలి
- ఒంటరిగా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయకూడదు
- పశువులను దాటించే సమయాల్లో మరింత జాగ్రత్త అవసరం

పిడుగులు, మెరుపులు

- వర్షాకాలంలో పిడుగులు సహజంగా పడుతుంటాయి. చెట్లు ఉన్న ప్రదేశాల్లో పిడుగు పడే అవకాశం అధికంగా ఉంటుంది. అలాంటి సమయాల్లో చాలా అప్రమత్తంగా ఉండాలి.

సూచనలు :

- ఆకాశం మేఘావృతమైనపుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి
- వర్షంలో తడవకుండా ఉండటానికి చాల మంది చెట్లను ఆశ్రయిస్తారు. అది సరైన పద్ధతి కాదు
- పిడుగులు ఎక్కువగా చెట్లపైనే పడతాయి. కాబట్టి చెట్లకు దూరంగా ఉండాలి
- ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో వర్షంలో ఉండరాదు
- సెల్‌ఫోన్లు ఉంటే వాటిని స్విచ్‌ఆఫ్ చేసుకోవాలి

ఇలా పలు జాగ్రత్తల ద్వారా వర్షాకాలంలో సంభవించే ప్రమాదాల నుంచి రైతులు తప్పించుకోవచ్చని సూచనలు, సలహాలు అందజేశారు.

'హయ్యర్ పెన్షన్ క్లెయిమ్‌లో జాప్యం వద్దు'



'నిధి ఆప్కే నిక్కత్–2'లో భగవాన్‌సింగ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈపీఎస్ పింఛన్‌దారుల హయ్యర్ పెన్షన్ క్లెయిమ్‌లో జాప్యాన్ని నివారించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం ఉపాధ్యక్షుడు భగవంతు కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ షాపింగ్ మాల్‌లో ఈపీఎఫ్‌ఓ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన 'నిధి ఆప్కే నిక్కత్–2'లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి భగవాన్‌సింగ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని బర్కత్‌పురా పీఎఫ్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నందున ఈ పరిస్థితి నెలకొందన్నారు. సీనియారిటీని అనుసరించి ఈ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం వివిధ ప్రైవేట్ రంగ కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల సుమారు 30 సమస్యలను పరిష్కరించారు. ఇందులో ఈపీఎఫ్‌ఓ సభ్యత్వం, జీవన్ ప్రమాణ్ పత్రాల జారీ, హయ్యర్ పెన్షన్‌కు సంబంధించినవి ఉన్నాయి.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2వేల 653 క్యూసెక్కుల వరద చేరుతున్నట్లు మంగళవారం అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 656 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 53 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 709 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.684 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

శ్రీశైలానికి 4,462 క్యూసెక్కుల ప్రవాహం

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి మంగళవారం సుంకేసుల నుంచి 4,462 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 818.1 అడుగుల వద్ద 39.4343 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 4.758 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి దిగువన సాగర్‌కు 10,404 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.